క్లుప్తంగా

కోవిడ్ కేసులు నిల్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 8 మందికి పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనుమానితులు షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీ, దుండిగల్ పీఎస్‌సీల్లో సైతం పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్‌లోని గోదావరి హోమ్స్‌లో ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి గరుడ సేవ నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ కేబుల్ టీవీ జర్నలిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ.సత్యం, ఉపాధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా అంజిగౌడ్, జాయింట్ సెక్రటరీగా వెంకటేష్, ఆర్గనైజర్‌గా దుర్గారావు, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, రమేష్, శ్రవణ్, సోహెల్, పర్వేష్ తదితరులను ఎన్నుకున్నారు.

వైభవంగా అఖండ పూజ



ఆలయానికి తరలివస్తున్న బిహారీలు

సుభాష్‌నగర్: సూరారం డివిజన్ శ్రీకృష్ణనగర్‌లో బిహారీలు ఆదివారం ఘనంగా అఖండ పూజ నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుటుంబ సమేతంగా కాలినడకన బయలుదేరి సూరారం కట్టమైసమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. దారిపొడవునా డప్పు చప్పుళ్ల మధ్య వందలాది మంది బిహారీలు తరలిరావడంతో పండగ వాతావరణం నెలకొంది.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ పోలీసులు సూచించారు. పట్టణంలోని ప్రైవేట్ బీటెక్ హాస్టల్‌లో పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపట్టి నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో 'ఖురాన్ హిఫ్జ్'

కీసర: నాగారం మున్సిపాలిటీ మదర్సా మహమ్మదీయ తజ్విదూల్ ఖురాన్ ఆధ్వర్యంలో 7 మంది ముస్లిం పిల్లలు ఖురాన్ హిఫ్జ్ (కురాన్ చూడకుండా చదవడం) కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్, అన్నంరాజు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు ఆదం షఫిక్, ఖాజా, ముస్లిం మత పెద్దలు, మదర్స చైర్మన్ మసూర్ అలంసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బహుళ జాతీయ సంస్థ జోహో ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా నాలుగు దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని, అందులో కళాశాలకు చెందిన వారే ఇద్దరు విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ నర్సింహా రెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు తదితరులు అభినందించారు.

ఆర్టీసీ కాలనీలో బోనాల వేడుక

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కట్టమైసమ్మ ఆలయం నూతనంగా నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠించిన సందర్భంగా కాలనీ వాసులు ఆదివారం బోనాల పండగను ఘనంగా జరుపుకున్నారు. ప్రతిష్ఠ ఉత్సవాలు ముగియడంతో భక్తిశ్రద్ధలతో బోనాలను ఇళ్లల్లో తయారు చేసుకుని ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. దీంతో భక్తులతో నూతన ఆలయ ప్రాంగణం రద్దీగా కనిపించింది.

బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఫోన్‌లో అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్సీ

దుండిగల్: బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలపై ఫిర్యాదులు చేశారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

- కొంతమంది రెడ్డి ల్యాబ్స్ కార్మికులు ఆయనను కలిసి తమ యాజమాన్యం విధుల్లోంచి తొలగించిందని, తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, యాజమాన్యంతో చర్చించి తొలగించిన కార్మికులను తిరిగి తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ గాజుల సుజాత, కార్మికులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.
- దుండిగల్ గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు, గాజులరామారంలో రేణుక ఎల్లమ్మ జాతరకు శంభీపూర్ రాజు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు, జాతరలతో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడతాయని ఆయన అన్నారు.
- వంగవీటి మోహనరంగా కాపు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. నిజాంపేట్‌లో రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఆయనను శాలువాతో సత్కరించారు. కాపు సంఘానికి 2వేల గజాల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు. మల్లా సీతారామయ్య, ఎనుముల స్వామినాయుడు, కోలా లచ్చిబాబు, తటవర్తి సుధాకర్, బోడపాటి రామకృష్ణ కిషోర్, నూకల మల్లేశ్వరరావు, జొన్నకూటి ధర్మారావు, చంద్రగిరి రంజిత్‌పటేల్, పోతుల సత్యనారాయణ, ఆకుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పాలన అందించేందుకు కృషి



మేయర్ నీలారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌కు చెందిన బాలాజీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌ను కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా పని చేస్తున్నామని, అధికారులతో బాలాజీ హిల్స్‌లో పర్యటించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు చిరంజీవి, రమేష్, సునీల్‌చౌదరి, విజయ్‌కుమార్, సురేష్‌బాబు, శివప్రసాద్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శివారెడ్డినగర్‌లో పర్యటిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ శివారెడ్డినగర్‌లో జరుగుతున్న నాలా బ్రిడ్జి పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రయ్య, కనిగిరి, సుబ్బారావు, రామకృష్ణ, శ్రీనివాస్‌సెట్టి, మహేష్‌గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డిని సత్కరిస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌కు చెందిన ఏఎస్‌ఆర్ బృందావన్ కాలనీ వాసులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు గాను ఆయనను శాలువ కప్పి సత్కరించారు. అనంతరం వీరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు వెచ్చించామని, రాబోయే రోజుల్లో ప్రజల అవసరాల మేరకు మరిన్ని పనులు చేపడతామన్నారు.

ప్రతి కాలనీని మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కృష్ణారావు, వెంకటేశ్వరరావు, చందురెడ్డి, సుబ్బరాజు, రాజశేఖర్, సురేష్ రాజు, కూన రమేష్, వెంకటేశ్వరరావు, సురేష్, శ్రీనివాసులు, రమేష్, నాగరాజు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటా



ప్రతాప్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: వీధి వ్యాపారులకు అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని సుచిత్ర చౌరస్తా నుంచి సినీ ప్లానెట్ వరకు ఉన్న వీధి వ్యాపారులంతా జీవన కృషి స్ట్రీట్ వెండర్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. నూతన కమిటీ సభ్యులు ఆదివారం ప్రతాప్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారం చేసుకోవాలని, సర్కిల్ అధికారులతో మాట్లాడి స్ట్రీట్ వెండర్లకు గుర్తింపు కార్డులు ఇప్పిస్తానని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కృపాలని, సంయుక్త కార్యదర్శులు సూర్యనారాయణ, శివ, కోశాధికారి రాజేష్, ఆర్గనైజర్స్ నరసింహస్వామి, సురేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించండి

మోతీనగర్: అవంతినగర్ తోటకాలనీలో వారం రోజులుగా కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరించారని, అయితే తిరిగి సమస్య పునరావృతం అవుతుందన్నారు. తాగునీరు, డ్రైనేజీ లైన్లు పక్క పక్కనే ఉండడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ బోనాల జాతర



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని మూసాపేట దోభీ ఘాట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ బోనాల జాతర నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

రిపేర్‌కు వచ్చిన కార్లకు అడ్డాగా రోడ్లు



ఐడీపీఎల్ సమీపంలో రోడ్డుపై ఉంచిన కారు

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్లు రిపేర్‌కు వచ్చిన కార్లకు అడ్డాగా మారుతున్నాయి. ఐడీపీఎల్ సమీపంలో ఉన్న కొందరు కార్ల మెకానిక్‌లు ప్రధాన రోడ్లపైనే వాహనాల రిపేర్లు కొనసాగిస్తున్నారు. దీంతో రోడ్డు పొడవునా కార్లను నిలుపుతుండడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతుంది. సమీపంలోనే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా ఇది తమ పరిధిలోకి రాదన్నట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఒక వైపు గాంధీనగర్ పారిశ్రామికవాడ, మరో వైపు జగద్గిరిగుట్టకు రాకపోకలు సాగించే ఆర్టీసీ, జిల్లా సర్వీసులు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనాలతో నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. నిత్యం రోడ్డుపై ఆటోలు, కార్లను నిలిపి రిపేర్లు చేయడం పరిపాటిగా మారిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

'మేడ్చల్ అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం'



మేడ్చల్‌రూరల్: సీఎం కేసీఆర్ ఫాంహౌస్, ప్రగతిభవన్‌లకు పరిమితమైతే.. మంత్రి మల్లారెడ్డి కేవలం శిలాఫలకాలకే పరిమితం అయ్యాడని, నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి విమర్శించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మీనగర్‌లో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వస్తేనే నియోజకవర్గాలు అభివృద్ధి జరుగుతున్నాయని, కాబట్టి స్థానిక ఎమ్మెల్యే అయిన మంత్రి మల్లారెడ్డి రాజీనామా చేసేలా ఒత్తిడి తేవాలని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశా రు. అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు అమరం సరస్వతి, హంసరాణి, నాయకులు కృష్ణాగౌడ్, మహేశ్, అనిల్, అర్జున్, నాగరాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోధుమకుంట గ్రామంలో...

కీసర: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లను నిర్వహించడం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ అన్నారు. గోధుమకుంట గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి కోల బాల్‌రాజ్, జిల్లాల తిరుమల్‌రెడ్డి, దేశం మల్లేష్‌గౌడ్, వంగేటి బాపిరెడ్డి, కొలిచెలిమి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'అక్విలా 2కే23'

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్విలా 2కే23 పేరిట నిర్వహించిన అన్యువల్ డే అందరిని అలరించింది. కార్యక్రమంలో టీసీఎస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్, కాష్ మేనేజింగ్ డైరెక్టర్ గుమిడేళ్ల శ్రీధర్‌లు పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు 5జీ టెక్నాలజీ పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌గా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, చైర్మన్ బాలారెడ్డి, డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

అధికారం ఆమెది.. పెత్తనం అతడిది..

సర్పంచ్ సీట్లో ఆమె భర్త హల్‌చల్



పంచాయతీ కార్యాలయంలోని సర్పంచ్ సీట్లో కూర్చున్న సర్పంచ్ వెన్నెల భర్త రామకృష్ణుడు

మేడ్చల్: అధికార దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసిన సర్పంచ్ ఆమె హైకోర్టు ఆదేశాలతో తిరిగి ఆరు నెలల తర్వాత సర్పంచ్ పదవి పొందినా అధికార దుర్వినియోగం మాత్రం ఆగడం లేదు. మండలంలోని ఎల్లంపేట్ గ్రామ సర్పంచ్ వెన్నెల తీరిది. గ్రామంలో సర్పంచ్ వెన్నెల అయినప్పటికీ పెత్తనం ఆమె భర్త రామకృష్ణుడు సాగిస్తున్నాడు. సాధారణంగా మహిళలు ప్రజాప్రతినిధులు ఉన్న చోట వారి భర్తో.. కుమారుడో.. తెర వెనుక ఉండి అన్ని పనులు చక్కబెడతారు. రామకృష్ణుడు మాత్రం తన భార్యకు ఉన్న అధికారంను తానే తీసుకుని పూర్తిగా అధికార దుర్వినియోగం చేస్తున్నాడు. గతంలో గ్రామ కంఠం భూములను ప్లాట్లుగా చేసి సర్పంచ్ సంతకాలతో సర్టిఫికెట్లు జారీ చేసి విచారణలో సస్పెండ్ అయిన ఘటన విధితమే. తాజాగా ఆయన గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏకంగా సర్పంచ్ సీట్లోనే కూర్చుని అన్నీ తానై నడిపిస్తున్నాడు. సన్మానాలు చేసుకుంటూ తానే సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న ఫోటోలను గ్రామానికి చెందిన యువకుడు ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

ఎడ్జ్‌మౌంట్ ది గ్లోబల్ స్కూల్‌లో కల్చరల్ ఫెస్ట్



ఎడ్జ్‌మౌంట్ ది గ్లోబల్ స్కూల్‌లో కల్చరల్ ఫెస్ట్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని డీపోచంపల్లిలోని ఎడ్జ్‌మౌంట్ ది గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం కలచ్రల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.రావు, రామేశ్వర్‌రెడ్డి, శివయ్య, వరప్రసాద్, మహేష్‌కుమార్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు. – దుండిగల్

కాంగ్రెస్ ప్లీనరీలో హన్మంతరెడ్డి



కుత్బుల్లాపూర్: చత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో జరుగుతున్న ఏఐసీసీ 85వ ప్లీనరీ సమావేశాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం

అల్విన్‌కాలనీ: నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటాపయ్యనగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో 3లక్షల 63 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, నేర శోధన, నేర నివారణకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. అన్ని కాలనీల్లో స్థానికులు ముందుకువచ్చి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, జిల్లా గణేష్, దొడ్ల రామకృష్ణగౌడ్, కాశీనాథ్‌యాదవ్, శివరాజుగౌడ్, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకం సడలింది

బీజేపీ నేత శ్రీశైలంగౌడ్



స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను గాలికొదిలేశారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్, కాకతీయనగర్‌లో శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు కృష్ణయాదవ్, అలివేలు ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సడలిందని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు సమస్యలను పక్కనబెట్టి ఒకరిపై ఒకరు ఆధిపత్య పోరు కొనసాగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో కోట్ల మంది లబ్ధి పొందుతున్నారని, రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకుముందు కాకతీయనగర్ మార్కెట్‌లో బీజేపీ జెండా ఆవిష్కరించారు. బూత్ అధ్యక్షులు నగేష్‌గౌడ్, ఉమామహేశ్వర్, కిరణ్, నరేందర్, దుర్గ, డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, ఇన్‌చార్జ్ బిల్లా, నాయకులు నటరాజ్‌గౌడ్, దయాకర్, రవి, నరసింహాచారి, ఎల్లారెడ్డి, అశోక్, సురేందర్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.